సాక్షి పెద్దపల్లి

మంగళవారం। 24। సెప్టెంబర్। 2024

మొక్కలు నాటి.. సంరక్షించాలి

గోదావరిఖని: డీడీఎంఎస్ బానోత్ వెంకన్న, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ స్థానిక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సోమవారం మొక్కలు నాటారు. స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన అధికారులు.. వాటిని సంరక్షించాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాంమోహన్, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

చేతిపంపుల మరమ్మతుపై దృష్టి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీలో ప్రజల అవసరాలను తీర్చే చేతిపంపులు పనిచేసేలా చూడాలని అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్లకు చేతిపంపుల మరమ్మతుపై శిక్షణ ఇచ్చారు. గ్రామంలో కీలకంగా ఉన్న మల్టీపర్పస్ వర్కర్లు చేతిపంపుల మరమ్మతుపై అవగాహన పెంచుకుంటే సమస్య తక్షణమే పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో మిషన్‌భగీరథ ఈఈ శ్రీనివాస్, ఏఈ రవీంద్రనాథ్, ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

‘అవి కార్మిక వ్యతిరేక విధానాలు’



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్డులో సోమవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్మిక వర్గానికి అన్యాయం చేసే కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కనీస పింఛన్ రూ.9 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. జేఏసీ సంఘాల నాయకులు నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, చిలుక శంకర్, సత్యనారాయణ, భూమయ్య, వెంకటస్వామి, రాఘవరెడ్డి, మల్లేశ్, మహేందర్, దాసు, షమీం, చంద్రమౌళి, రాజయ్య, మల్లయ్య, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


యాదవరాజుకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న యాదవరాజు

జ్యోతినగర్(రామగుండం): నేషనల్ యూత్ ప్రాజెక్టు తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షుడు కె.యాదవరాజుకు ఉత్తమ సమాజ సేవా అవార్డు లభించింది. హైదరాబాద్ ఖైరతాబాద్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర యాదవ సేవా సమితి ఆధ్వర్యంలో పలువురికి ఈ అవార్డులను అందించారు. గోదావరిఖనికి చెందిన యాదవరాజుకు సేవా విభాగంలో అవార్డు ప్రకటించగా.. ఆ సంస్థ అధ్యక్షుడు అల్లాడి శరత్ తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు.

కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక



రమేశ్

ముత్తారం(మంథని): అడవిశ్రీరాంపూర్ సాయి మారుతి కళా మండలి నుంచి గొస్కుల రమేశ్ యాదవ్ తెలంగాణ ఉద్యమ కళాకారు సంఘం జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోశెట్టి ఆదేశాల మేరకు ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు గుండెటి అయిలయ్య, ఉపాధ్యాక్షుడు నూనె రాజేశం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

గోదావరిఖనిటౌన్: స్థానిక సీఈఆర్ క్లబ్‌లో జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే టోర్నమెంట్ ఎంపిక పోటీలను సోమవారం నిర్వహించారు. సింగరేణి సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ వీరారెడ్డి హాజరై పోటీలు ప్రారంభించారు. పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ ఆదా ఉపకరణాలు

పెద్దపల్లిరూరల్: కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ, ఎన్పీడీసీఎల్ అనుబంధ ఎనర్జీఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో విద్యుత్‌ను ఆదా చేసేలా రూపొందించిన నాణ్యమైన ఉపకరణాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయని ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ సోమవారం తెలిపారు. నాణ్యమైన ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, ఇండక్షన్ స్టవ్, ఫ్యాన్లు తదితర ఉపకరణాలు తక్కువ ధరల్లోనే అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఆన్‌లైన్‌లోనే వీటిని ఆర్డర్ చేస్తే ఇంటివద్దనే డెలివరీ చేస్తారని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీస్ లిమిటెడ్ పేజీలో ఉన్న క్యూఆర్ కోడ్ కూడా స్కాన్ చేసి ఆర్డర్ చేసుకోవచ్చని ఆయన సూచించారు.

టెండర్.. టెర్రర్

- ధాన్యం రవాణా లారీల కోసం నోటిఫికేషన్ జారీ
- ఆన్‌లైన్ పద్ధతిన దరఖాస్తుల ఆహ్వానం
- హార్డ్‌కాపీలు అందజేసే సమయంలో గొడవలు
- ఒకరి దరఖాస్తులు మరొకరు పట్టుకుని పారిపోయిన కాంట్రాక్టర్లు
- ఈనెలలో రెండోసారి ఇలాగే సాగిన వైనం



కలెక్టరేట్‌లోని డీఎంవో కార్యాలయంలో గొడవ పడుతున్న ఇరువర్గాల టెండర్‌దారులు, వారిని సముదాయిస్తున్న పోలీసులు

సాక్షి, పెద్దపల్లి: గతంలో ఎన్నడూ లేనివిధంగా జిల్లాలో ధాన్యం రవాణా చేసే లారీల టెండర్లలో ఈసారి తీవ్రమైన పోటీ నెలకొంది. లారీ యజమానులు వర్గాలుగా విడిపోయి టెండర్లు దాఖలు చేస్తున్నారు. ఈక్రమంలో టెండర్ వేయకుండా పరస్పరం అడ్డుకోవడం, కొందరు దరఖాస్తులను అపహరించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సోమవారం ఒకవైపు ప్రజావాణిలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉండగానే, ఆయన ఎదుటే లారీ అసోసియేషన్ ప్రతినిధులు గలాటాకు దిగడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలోనూ అధికార యంత్రాంగం ఇలాగే చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే కలెక్టర్ ఎదుటనే కాంట్రాక్టర్లు తన్నుకునే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. తాజాగా కలెక్టరేట్‌లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్నారు.

ధాన్యం సరఫరా కోసం..

జిల్లాలో వానాకాలం, యాసంగి(2024–25) సీజన్లలో సేకరించే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు తరలించేందుకు లారీలు అవసరమని, ఇందుకోసం ఆసక్తిగలవారి నుంచి జిల్లా పౌర సరఫరాల శాఖ టెండర్లు ఆహ్వానించింది. గతంలో మాదిరిగానే పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, రామగుండం సెక్టార్ల పరిధిలో ఆగస్టు 23న టెండరు నోటిఫికేషన్ జారీచేశారు. కాంట్రాక్టర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డ్‌కాపీలను డీఎం కార్యాలయంలోని టెండర్ బాక్స్‌లో నేరుగా వేయాలి. ఈక్రమంలోనే హార్డ్‌కాపీలను టెండర్ బాక్స్‌లో వేసే సమయంలో అందులో వేయకుండా పరస్పరం వాటిని కాంట్రాక్టర్లు అపహరిస్తున్నారు.

అప్పుడు రామగుండం.. ఇప్పుడు సుల్తానాబాద్..

జిల్లాలోని నాలుగు సెక్టార్లలో టెండర్ల దాఖలుకు ఈ నెల 5వ తేదీ వరకు గడువు ఇచ్చారు. పెద్దపల్లి నుంచి సన్‌రైజర్ ట్రాన్స్‌పోర్ట్, సుల్తానాబాద్ సెక్టారులో ఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్, రామసేతు ఎంటర్ ప్రైజెస్, మంథనిలో సయ్యద్ అండ్ సన్స్, శ్రీవిజయదుర్గ ట్రాన్స్‌పోర్ట్, రామగుండం సెక్టార్‌లో రామగుండం లారీ అసోసియేషన్ టెండర్లు దాఖలు చేశాయి. రామగుండంలో కాటారానికి చెందిన సాయిరాం లారీ ట్రాన్స్‌పోర్ట్ టెండర్ దాఖలు చేసేందుకు ఈనెల 5న కలెక్టరేట్‌కు చేరుకుంది. అయితే, స్థానికేతరులు తమ పరిధిలోకి వచ్చి టెండరు ఎలా దాఖలు చేస్తారని స్థానిక కాంట్రాక్టర్లు ఆ సంస్థ ప్రతినిధులతో ఘర్షణకు దిగారు. ఈక్రమంలో రామగుండం ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అనూహ్యంగా కాటారానికి చెందిన టెండర్ హార్డ్‌కాపీలను పట్టుకుని అక్కడి నుంచి పరారయ్యారు. చివరికి అధికారులు మరోరోజు గడువు ఇవ్వడంతో రెండు వర్గాల లారీ ఓనర్లు ఒక్కటై రాజీపడ్డారు. దీంతో సమస్య అప్పుడు సద్దుమణిగింది. సమస్య సమసి పోవడంతో టెండరు పత్రాలు ఎత్తుకుపోయిన వారిపై అధికారులు అప్పుడు ఫిర్యాదు చేయలేదు. అయితే, టెండర్ ఓపెన్ చేసే సమయంలో సుల్తానాబాద్ సెక్టార్ దరఖాస్తులో సాంకేతిక లోపాలు ఉన్నాయనే ఫిర్యాదులు రావడంతో ఆ టెండర్‌ను అధికారులు రద్దు చేశారు. అదే సెక్టార్‌కు ఈనెల 19న మరోసారి టెండర్లు ఆహ్వానించారు. దరఖాస్తుల దాఖలుకు సోమవారం తుది గడువు విధించారు. ఈక్రమంలో ఎస్ఆర్ ట్రాన్స్‌పోర్ట్, సాయి హనుమాన్‌తోపాటు కరీంనగర్‌కు చెందిన రాంసేతు ట్రాన్స్‌పోర్ట్స్ ప్రతినిధులు టెండర్ పత్రాలు దాఖలు చేసేందుకు పెద్దపల్లి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అయితే, రాంసేతు సంస్థ హార్డ్‌కాపీలు దాఖలు చేయకుండా మిగతా ట్రాన్స్‌పోర్టుల ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈక్రమంలో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగింది. అయితే, అక్కడి నుంచి తప్పించుకున్న బాధిత సంస్థ నిర్వాహకులు ప్రజావాణి కార్యక్రమానికి చేరుకుని అక్కడ ఉన్న కలెక్టర్ కోయ శ్రీహర్షకు హార్డ్‌కాపీలు అందజేశారు.

పోటాపోటీ వెనుక మతలబు ఏమిటి?

జిల్లాలో ఈసారి 311 కేంద్రాల ద్వారా 4,06,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు అధికారుల ప్రణాళిక సిద్ధం చేశారు. ఇలా సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు దూరాన్ని బట్టి ప్రభుత్వం లారీ అద్దె చెల్లిస్తుంది. ఈ సొమ్ము పెద్దమొత్తంలో చేతికి వస్తుండడంతో కొందరు రాజకీయ నేతలు తమ అనుచరులకే టెండరు దక్కేలా చక్రం తిప్పుతున్నారు. అంతేకాదు.. తూకం పూర్తయ్యాక రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు రైతుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేస్తుండడం కూడా లారీ యజమానుల్లో పోటీకి మరోకారణమని తెలుస్తోంది.

ఈ విషయం తెలుసుకున్న మిగతావారు ప్రజావాణి చాంబర్‌కు చేరుకుని కలెక్టర్ ఎదుటే అడ్డుకున్నారు. ఈక్రమంలో రెండువర్గాలు తన్నుకున్నాయి. దీంతో కలెక్టరేట్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నారు. కలెక్టరేట్ రణరంగంగా మారింది. పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపుకి తెచ్చారు. ధాన్యం రవాణా కోసం ఆహ్వానించిన టెండర్ల కోసం ఒకేనెలలో కాంట్రాక్టర్లు రెండుసార్లు తన్నుకోవడం జిల్లాలో దుమారం రేపుతోంది.

సమస్యలు ఆలకించండి.. సత్వరమే పరిష్కరించండి

- ప్రజావాణిలో కలెక్టర్‌కు అభాగ్యుల మొర
- తక్షణమే పరిష్కరించాలని శ్రీహర్ష ఆదేశం



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన అభాగ్యులు సోమవారం కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చారు. వారి సమస్యలను అర్జీల రూపంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి విన్నవించారు. ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- రామగుండం కృష్ణానగర్‌లో రోడ్డును ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టారు. దీనిద్వారా మాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దానిని తొలగించేలా టాస్క్‌ఫోర్స్ కమిటీకి ఆదేశాలివ్వండి.

  – కాలనీవాసుల మొర

- నేను దివ్యాంగురాలిని. దివ్యాంగుల పింఛన్ వర్తింపజేసి ఆదుకోండి

  – లలిత, హన్మంతునిపేట, పెద్దపల్లి మండలం

సర్కారు భూమిని కాపాడాలి



గూడెం గ్రామ శివారులోని సర్వే నంబరు 251లో 12 ఎకరాలు, సర్వే నంబరు 250లో ఏడెకరాల ప్రభుత్వభూమిని కొందరు భూస్వాములు కబ్జా చేశారు. అందులో పంటలు పండిస్తున్నారు. కబ్జాలపై విచారణ జరిపి ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకోవాలి. పేదలకు పంపిణీ చేయాలి.

– కామని శ్రీనివాస్, గూడెం, ఓదెల

పింఛన్ ఇప్పించండి



నాకు ఏ ఆధారం లేదు. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న. రోజూవారీగా కూలీనాలీ చేసుకున్నా పూటగడుస్తలేదు. నిస్సహాయ స్థితిలో ఉన్న. పింఛన్ ఇప్పించి ఆదుకోండి.

– మేరుగు రాజమ్మ, కనగర్తి

మా భూములు ఇప్పించండి



మా ఊరు పరిధిలోని భూములను పలుకుబడి గల కొందరు ఆక్రమించుకున్నరు. హైదరాబాద్ ప్రజాభవన్‌లో దీనిపై ఆధారాలతో ఫిర్యాదు చేసినం. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి న్యాయంగా మాకు దక్కాల్సిన భూమిని ఇప్పించి ఆదుకోవాలి.

– మధునయ్య, శంకర్, పెద్దబొంకూర్

సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటుచేయాలి



కలెక్టరేట్ ఎదుట రాజీవ్ రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయించాలి. పనుల కోసం వచ్చేవారితోపాటు ఉద్యోగులు చీకట్లో అవస్థలు పడుతున్నారు. వీలైనంత త్వరగా సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలి.

– కనుకుంట్ల సదానందం, సామాజిక కార్యకర్త

మార్కెట్‌కు ఏటా రూ.42.35 లక్షల ఆదాయం

పెద్దపల్లిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లు అద్దెకు ఇవ్వడం ద్వారా ఏటా సుమారు రూ.42,34,800 ఆదాయం సమకూరనుంది. ఈమేరకు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలోని షాపింగ్ కాంప్లెక్స్ గదులను అద్దెకు ఇచ్చేందుకు అధికారులు సోమవారం వేలం పాట నిర్వహించారు. వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏ, బీ, సీ విభాగాలుగా చేసిన 15 గదులను అద్దెకు ఇచ్చేందుకు వేలం పాట పూర్తిచేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు. ఇందులో గరిష్ఠంగా ప్రతినెలా రూ.26,250 అద్దె చెల్లించేందుకు వ్యాపారులు ముందుకు రాగా, కనిష్ఠంగా రూ.19,200 చెల్లించేందుకు మరికొందరు వ్యాపారులు ముందుకు వచ్చారని ఆయన వివరించారు. నిబంధనల మేరకు వ్యాపారులకు గదులు అద్దెకు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఓపికతో వైద్య సేవలు అందించండి

- విధుల్లో సంయమనం పాటించండి
- అనుమతి లేకుండా గైర్హాజరు కావొద్దు
- హెచ్‌డీఎస్ కమిటీ సభ్యుడు డాక్టర్ అనిల్‌కుమార్



మాట్లాడుతున్న డాక్టర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): ఓపికతో పేషెంట్లకు వైద్య సేవలు అందించాలని, విధుల్లో కచ్చితంగా సంయమనం పాటించాలని గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) వైద్యులకు రామగుండం నగరపాలక మేయర్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సొసైటీ సభ్యుడు(హెచ్‌డీఎస్) డాక్టర్ బంగి అనిల్‌కుమార్ సూచించారు. హెచ్‌డీఎస్ సభ్యుడి హోదాలో నగర మేయర్ అనిల్‌కుమార్ సోమవారం జీజీహెచ్ వైద్యులతో వైద్యసేవలపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. చాలామంది డాక్టర్లు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్నారన్నారు. పనివేళల్లో కూడా అందుబాటులో ఉండడం లేదని తనకు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తెలిపారు. అన్ని విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లకు మూడు రోజుల ముందుగానే సమాచారం ఇచ్చినా సమీక్షకు మూడు విభాగాల అధిపతులే హాజరు కావడం శోచనీయమన్నారు. హెచ్‌వోడీలు గైర్హాజరు కావడం, కాంట్రాక్ట్ వైద్యులుగా సేవలు అందించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తాము పనిభారంతో పడుతున్నామని అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. జీజీహెచ్‌లో పేషెంట్లు, వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి మరింత మెరుగైన సేవలు అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, కలెక్టర్ శ్రీహర్ష, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళతానని మేయర్ అన్నారు. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్ టీపీ దయాళ్‌సింగ్‌తోపాటు వివిధ విభాగాల హెచ్‌వోడీలు ఎ.అశోక్, ఆర్.అరుణ, శిరోమణి, ఆర్ఎంవో రేణుక, ఆర్ఎంవోలు చంద్రశేఖర్, అశోక్‌కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

ఓదెల ఆలయ అర్చకుడికి అవార్డు



అవార్డు అందుకుంటున్న నరసింహాచార్య

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి ఆలయ అర్చకుడు ఆరుట్ల నరసింహాచార్యకు అర్చకరత్న పురస్కారం లభించింది. తిరుపతిలో ఇటీవల జరిగిన అర్చకజ్యోతిష సభలో తిరుమల, శ్రీకాళహస్తి దేవస్థానం ప్రధాన అర్చకుల నుంచి ఆయన ఈ అవార్డు అందుకున్నారు. అంకితభావంతో సేవలు అందిస్తున్నందుకు ఆయనకు ఈ పురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఆందోళన



పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు రవీందర్, వెంకటస్వామి

- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సోమవారం బ్లాక్ డే నిర్వహించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాసేలా లేబర్‌కోడ్‌లను తీసుకొచ్చారని విమర్శించారు. అదానీ, అంబానీ లాంటి బడాపారిశ్రామికవేత్తలకు అనుగుణంగా చట్టాలు ప్రవేశపెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఐ.కృష్ణ, కుమారస్వామి, ఇ.నరేశ్, ఎం.దుర్గయ్య, ఎం.కొమరయ్య, రాజయ్య, తిరుపతి, ఎడ్ల రవికుమార్, ఎస్.రాజేందర్, మల్లేశ్, శ్రీనివాస్, సతీశ్, రఘు, బాలకృష్ణ, సదానందం, కాంపెల్లి మల్లేశం, డి.శ్రీనివాస్, అంజిబాబు, సీహెచ్ వేణు, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో..

జ్యోతినగర్(రామగుండం): కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా విశాల కార్మిక ఐక్యవేదిక ద్వారా ఉద్యమం చేపట్టాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు తోకల రమేశ్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి కోరారు. ఎన్టీపీసీ లేబర్ గేట్ వద్ద కార్మిక సంఘాల పిలుపుమేరకు నిరసన చేపట్టారు. కేంద్రప్రభుత్వం చర్చ లేకుండా కార్మిక చట్టాలను పార్లమెంటులో సవరించిందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాసేలా చట్టాలను రూపొందించిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిలో..

పెద్దపల్లిరూరల్: స్థానిక అమరవీరుల స్తూపం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు. ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, నాయకులు వెంకటస్వామి, సురేశ్, సాగర్, అన్వేష్, శంకర్, రాజేందర్, కిరణ్, గౌరయ్య, కనకలక్ష్మి, స్వప్న, లలిత, మమత పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులపై ఆశలు

- అక్టోబర్ 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో ఇప్పటికే ఉన్న కార్డులు 2,19,675



పెద్దపల్లిరూరల్: ‘అర్హులందరికీ కొత్తగా రేషన్ కార్డులు అందిస్తాం.. అక్టోబర్ 2 నుంచి దరఖాస్తులు స్వీకరించాలి’ అని హైదరాబాద్‌లో ఇటీవల సంబంధిత శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీచేయడంతో పేదల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. ఇలా కొత్త రేషన్‌కార్డుల జారీపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో చాలాఏళ్లుగా నిరీక్షిస్తున్నవారు సంతోషపడుతున్నారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సీఎం సూచించడంతో తమ చేతికి రేషన్ కార్డు అందుతుందనే ఆశ పేద కుటుంబాల్లో వ్యక్తమౌతోంది. ఇప్పటికే రేషన్ కార్డు ఉండి కొత్తగా పేర్లు నమోదు చేసుకునే విషయంపై స్పష్టత ఇవ్వకపోవడం కొందరిని నిరాశకు గురిచేస్తోంది. జిల్లాలో ఇప్పటికే 2,19,675 రేషన్ కార్డులు ఉండగా.. కొత్తగా రేషన్‌కార్డుల కోసం గతంలో 2,436 మంది దరఖాస్తు చేసుకుని కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులు..

కొత్తరేషన్ కార్డుల కోసం పేదలు చాలాకాలంగా ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక వాటి ఊసే లేకుండాపోయింది. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజాపాలన కార్యక్రమం ద్వారా వీటికోసం దరఖాస్తులు స్వీకరించింది. ఇప్పటివరకూ వాటిపై స్పష్టత లేకుండా పోయింది. ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం సమావేశమై రేషన్‌కార్డులను చాలామంది సబ్సిడీ సరుకుల కోసం కాకుండా ఆరోగ్యశ్రీ వైద్యసేవల కోసమే తీసుకుంటున్నారనే ఆలోచనకు వచ్చింది. దీంతో అవసరమున్న వారికే రేషన్ కార్డులు జారీ చేసి, మిగతా వారికి ఆరోగ్యసేవలు పొందేలా హెల్త్‌కార్డులు జారీచేయాలనే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

జనవరి నుంచి సన్నబియ్యం..

రేషన్‌కార్డుదారులకు వచ్చే ఏడాది జనవరి నుంచి సన్నరకం బియ్యాన్ని చౌకధరలకే అందించాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. సన్నరకం వరి పంట సాగు చేసిన రైతులు సాధించే దిగుబడులకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఈసారి సన్నరకం వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది.

వైఎస్సార్ హయాంలో 8 రకాల సరుకులు..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో తెల్లరేషన్‌కార్డు దారులకు ప్రతినెలా రూ.185లకే 8 రకాల నిత్యావసరాలు అందజేశారు. పండుగల సమయంలో ఆ కోటా ఇంకా పెంచి ఇచ్చారని కార్డుదారులు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు భగ్గుమంటున్నాయని, ఆదాయం ఏ మూలకూ సరిపోవడం లేదని వాపోతున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వైఎస్సార్ అందించినట్లు నిత్యావసరాలు పంపిణీ చేస్తే పేదలకు అండగా ఉంటుందని భావిస్తున్నారు.

ఏళ్లుగా ఎదురుచూపులే..



కొత్త రేషన్‌కార్డు కోసం ఐదారేళ్లుగా ఎదురుచూస్తున్న. కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీప్రక్రియ చేపడతామని చెప్పడం సంతోషంగా ఉంది. వీలైనంత త్వరగా కార్డులు జారీ చేసి మాలాంటి పేదలకు అండగా నిలవాలి.

– రాధాకిషన్, పెద్దపల్లి

మార్గదర్శకాలు రాలేదు



కొత్త రేషన్ కార్డుల జారీపై ప్రభుత్వం నుంచి మాకు ఇంకా మార్గదర్శకాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. నిబంధనలకు లోబడే కొత్త కార్డుల జారీ చేపడతాం.

– రాజేందర్, డీఎస్‌వో, పెద్దపల్లి

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులో ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. అగుళ్ల శ్రీనివాస్(45) కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైరింజన్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహం కోసం బావిలో గాలింపు చర్యలు చేపట్టారు.

మానేరు డ్యాంలో దూకిన వివాహిత

- లైఫ్ జాకెట్ విసిరి, రక్షించిన టూరిస్టులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని మానేరు డ్యాంలో ఓ వివాహిత దూకిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన వివాహిత ఆదివారం డ్యాం వద్దకు వెళ్లింది. టిక్కెట్ కొనుగోలు చేసి, టూరిస్ట్ బోటులో ఎక్కింది. మానేరు అందాలను వీక్షించేందుకు వెళ్తున్న మరో 17 మంది టూరిస్టులు అందులో ఉన్నారు. బోటు స్పీడ్ పెరగగానే సదరు వివాహిత వెనక్కి వెళ్లి, లైఫ్ జాకెట్ పక్కన పడేసి, నీటిలో దూకింది. దీంతో మిగతావారు షాక్‌కు గురయ్యారు. డ్రైవర్ బోటును ఆపగా, టూరిస్టులు కొందరు లైఫ్ జాకెట్ విసిరి, ఆమెను రక్షించారు. అనంతరం లేక్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని, బాధితురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎందుకు ఆత్మహత్యాయత్నం చేసిందన్న విషయం తెలియరాలేదు. దీనిపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

వెల్గటూర్ (ధర్మపురి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లికి చెందిన రాచర్ల శంకర్(43), ఢీకొండ గ్రామానికి చెందిన గోపాల్ గత శనివారం పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఎండపల్లి వైపు వెళ్తున్నారు. ఎండపల్లి మండలంలోని చెర్లపల్లి వద్ద ధర్మారం మండల కేంద్రానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపాల్ కాలు విరగగా, శంకర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శంకర్ సోమవారం మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

మెట్‌పల్లిరూరల్: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తి మృతి చెందినట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలంలోని మెట్లచిట్టాపూర్‌కు చెందిన బొమ్మ రవి(46) ఈ నెల 18న మెట్‌పల్లిలో పని ముగించుకొని, బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి, కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయమైంది. కుటుంబసభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు సోమవారం ఇంటికి తీసుకెళ్లగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- 10 నెలల క్రితమే భర్త ఆత్మహత్య
- అనాథలైన ఇద్దరు పిల్లలు
- మానకొండూర్‌లో ఘటన

మానకొండూర్: తల్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది.. తండ్రి 10 నెలల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు.. దీంతో ఐదేళ్లు, నాలుగేళ్ల వయసున్న ఆ దంపతుల పాప, బాబు అనాథలయ్యారు.. ఈ విషాద ఘటన మానకొండూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన కోంద్ర పవన్‌కల్యాణ్, ప్రహర్ష(24) 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక పాప, బాబు సంతానం. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్ 10 నెలల క్రితం ఇంట్లో ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రహర్ష కరీంనగర్‌లోని ఓ ట్రాక్టర్ షోరూంలో పని చేస్తోంది. సోమవారం ఉదయం 9.30 గంటలకు పిల్లలను స్కూల్‌కు పంపించి వస్తానని మామ లక్ష్మణ్‌తో చెప్పి, వెళ్లింది. తిరిగి రాకపోవడంతో అతను చుట్టుపక్కల వెతికాడు. సమీప బావిలో ఆమె శవమై కనిపించింది. అయితే, ఉదయం ఓ వ్యక్తి స్కూటీపై వచ్చి, ప్రహర్షతో మాట్లాడి వెళ్లాడని మృతురాలి అత్త భాగ్య చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ప్రహర్ష చనిపోవడానికి ఆ వ్యక్తే కారణమా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అని మృతురాలి సోదరి నిర్మిట్ల ప్రసన్న అనుమానం వ్యక్తం చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాగా, పసితనంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చూసి, వారి నానమ్మ, తాతయ్య కన్నీరుమున్నీరుగా విలపించారు. అది చూసి, స్థానికులు కంటతడి పెట్టారు.


భర్త, పిల్లలతో ప్రహర్ష (ఫైల్)

'మాఫీ' ఏది.. రైతు భరోసా ఎప్పుడిస్తరు?

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణను నిలదీసిన రైతులు
- శంకరపట్నంలో ఘటన

శంకరపట్నం(మానకొండూర్): రూ.2 లక్షల పంట రుణమాఫీ ఏది.. మాకు ఇంకా కాలేదు.. రైతు భరోసా ఎప్పుడిస్తరంటూ.. రైతులు ఎమ్మెల్యేను నిలదీసిన ఘటన శంకరపట్నంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శంకరపట్నం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో జరిగే కార్యక్రమానికి వెళ్తుండగా కన్నాపూర్ రైతులు ఆయనను చుట్టుముట్టారు. మొలంగూర్‌ఎ ఇండియన్ బ్యాంక్‌లో తీసుకున్న సుమారు 900 మంది రైతుల పంట రుణాలు మాఫీ కాలేదన్నారు. వ్యవసాయ అధికారులకు ధ్రువపత్రాలు ఇచ్చినా లాభం లేకపోయిందని, ఇలా ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నరు? మిమ్మల్ని చేయమని రైతులు అడిగిండ్రా? హామీ ఇచ్చి, ఎందుకు చేయడం లేదు.. రైతు భరోసా ఎప్పుడిస్తరని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ ఐదేళ్లు చేసినా పూర్తి చేయలేదని, అధికారంలోకి వచ్చి 6 నెలలు కాకున్నా బద్నాం చేస్తున్నారంటూ రైతులతో కాంగ్రెస్ నాయకులు వాదనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీయడంతో రూ.2 లక్షల పైన ఉన్న వారికి మాఫీ కాలేదని, పైన ఉన్న డబ్బులు చెల్లిస్తే అయ్యేదని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులై, రూ.2 లక్షల రుణమాఫీ కాని వారందరికీ తప్పకుండా చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినా రైతులు శాంతించలేదు. దీంతో ఆయన రైతువేదిక వద్దకు వెళ్లిపోయారు.


ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను నిలదీస్తున్న రైతులు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

కరీంనగర్: జిల్లాలో పని చేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.తిరుపతి, కె.బాపూరావు కోరారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు. జిల్లాలో గత కొన్నేళ్లుగా వివిధ పత్రికలు, చానళ్లలో రిపోర్టర్లుగా ఉన్నవారు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో చాలా మందివి పేద కుటుంబాలేనని, సొంత ఇల్లు లేక అద్దెకు ఉంటూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తామని, నివేశన స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఆ హామీ మేరకు జిల్లాలో అర్హులైన జర్నలిస్టులను గుర్తించి, వెంటనే నివేశన స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్ రాజు, చెట్ల శంకర్, రమణ, లావణ్య, దొడ్డ రాజేంద్రప్రసాద్, ఖాజాఖాన్, లక్కం సురేశ్, రమేశ్, విజయ్‌కుమార్, సుదర్శన్ రెడ్డి, రవీందర్, నీల రాజు, కొమ్ము గణేశ్, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం ఇస్తున్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు

ట్రాక్టర్ ప్రమాద కారకుడికి 19 నెలల జైలు

వీణవంక(హుజూరాబాద్): అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి, ఓ బాలుడి మృతికి, పలువురు తీవ్రంగా గాయపడేందుకు కారణమైన వ్యక్తికి 19 నెలల జైలుశిక్ష, రూ.6,500 జరిమానా విధిస్తూ హుజూరాబాద్ మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు. వీణవంక కోర్టు విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. వీణవంక మండలంలోని బొంతుపల్లికి చెందిన జునూతుల మనోహర్‌రెడ్డి 2003లో అజాగ్రత్తగా, అతివేగంగా ట్రాక్టర్ నడపడంతో అది బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జునూతుల రాజేశ్వర్‌రెడ్డి (9) అక్కడికక్కడే మృతి చెందగా జునూతుల శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వరమ్మ, చదువు శ్రీనివాస్‌రెడ్డి, వీరారెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి సోమవారం మనోహర్‌రెడ్డికి శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో నిబద్ధతతో పని చేసి, నేరస్తుడికి శిక్ష పడేలా చేసిన జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్సై తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులును హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అభినందించారు.

తాళం వేసిన మూడిళ్లలో చోరీ

పెద్దపల్లిరూరల్: తాళం వేసిన మూడిళ్లలో ఆదివా రం రాత్రి దొంగలు పడి, బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ చేశారు. బాధితుల వివరాల ప్రకారం.. పెద్దపల్లి పట్టణంలోని లక్ష్మినగర్(చీకురాయిరోడ్)లో ఎర్రోజు వేణుగోపాల్ ఇంట్లోని 13 తులాల బంగారు, ఐదున్నర తులాల వెండి ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వచ్చే నెలలో తన కూతురు పెళ్లి ఉందని, ఈ సమయంలో నగలు పోయాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. ఏసీపీ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావు బాధితుడి ఇంటికి చేరుకొని, పరిశీలించారు. క్లూస్ టీం సహకారంతో ఆధారాలు సేకరించారు. అలాగే, ఇదే కాలనీకి చెందిన లక్ష్మణ్‌రావు ఇంట్లో ఇటీవల అద్దెకు దిగినవారి గదిలోని రూ.2 వేలు, సెల్‌ఫోన్ చార్జర్లు పోయాయి. శివపురి కాలనీకి చెందిన మరో ఇంట్లో దొంగలు పడి, రూ.లక్ష, తులం బంగారం ఎత్తుకెళ్లారు. వరుస చోరీలతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తాళాలు వేసి, ఊళ్లకు వెళ్లేవారు ఇంటి సమీపంలోని వారికి, పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ఎస్సై లక్ష్మణ్‌రావు

జాతీయ ట్రెక్కింగ్ పోటీలకు ఎంపిక


అనిల్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) బీకాం ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎం.అనిల్ అక్టోబర్ 22న హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. శాతవాహన యూనివర్సిటీ పరిధిలో జరిగిన ట్రెక్కింగ్ క్యాంప్ సెలక్షన్స్‌లో అతను ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా సోమవారం అనిల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ వై.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్, బీకాం డిపార్ట్‌మెంట్ హెడ్ టి.రాజయ్య, వైస్ ప్రిన్సిపాల్ పి.నితిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అర్జున్, రాజేశం, ఎలిజబెత్ రాణి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ అనే యువకుడు నిప్పంటించుకొని, ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి బంధువుల వివరాల ప్రకారం.. శివప్రసాద్, అతని భార్య మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో అతను మనస్తాపానికి గురై, సోమవారం ఉదయం ఒంటిపై పెట్రోల్ పోసుకొని, నిప్పంటించుకున్నాడు. తీవ్ర గాయాలైన అతన్ని కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు బాధితుడి బంధువులు తెలిపారు.

మందు కొట్టిన గడ్డి తిని..

- 60 జీవాలకు అస్వస్థత
- రెండు మేకలు మృతి


జీవాలకు వైద్యం అందిస్తున్న డాక్టర్ రవీందర్

గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన సందవేని చిన్న వెంకన్న అనే రైతుకు చెందిన 40 జీవాలు అస్వస్థతకు గురైనట్లు వైద్యాధికారి రవీందర్ తెలిపారు. గడ్డి మందు కొట్టిన గడ్డిని మేయడం వల్లే ఇలా జరిగిందన్నారు. అలాగే, తిర్మలాపూర్ పీడీ గ్రామానికి చెందిన బిరుదుల గంగాధర్ అనే రైతుకు చెందిన మేకలు గడ్డి మందు కొట్టిన గడ్డి మేశాయని తెలిపారు. 2 మేకలు చనిపోగా 20 జీవాలు అస్వస్థతకు గురయ్యాయన్నారు. సోమవారం వీటన్నింటికీ వైద్యం అందించినట్లు పేర్కొన్నారు.

క్యూలైన్‌లో కుప్పకూలిన భక్తుడు

- వేములవాడ ఆలయంలో ఘటన


బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఆలయ సిబ్బంది

వేములవాడ: రాజన్నను దర్శించుకునేందుకు సోమవారం వరంగల్ నుంచి కుటుంబసభ్యులతో వచ్చిన ఓ భక్తుడికి క్యూలైన్‌లో ఉండగానే ఫిట్స్ వచ్చింది. దీంతో అతను అక్కడే కుప్పకూలాడు. ఆలయ సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడికి ప్రాణాపాయం తప్పిందని పేర్కొన్నారు.

వివాహితపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ వివాహితపై ఓ ఉపాధ్యాయుడు లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన జమ్మికుంట పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో ఓ వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. ఉపాధ్యాయుడు తరచూ అతని భార్యకు ఫోన్ చేస్తూ, మెస్సేజ్‌లు పెడుతున్నాడు. ఆమెను లైంగికంగా వేధిస్తున్నాడు. భరించలేక బాధితురాలు ఆదివారం రాత్రి 100కు కాల్ చేసింది. దీంతో బ్లూకోల్ట్స్ పోలీసులు ఆ ఇంటికి చేరుకొని, సదరు వివాహిత వద్ద వివరాలు సేకరించారు. దీనిపై టౌన్ సీఐ రవిని వివరణ కోరగా బాధితురాలు 100కు కాల్ చేసింది వాస్తమేనన్నారు. ఫిర్యాదు ఇవ్వమంటే కొంత సమయం తీసుకుంటామని ఆమె భర్త తెలిపినట్లు పేర్కొన్నారు. అయితే, రాత్రే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిసింది. కానీ, స్థానిక కొంతమంది పెద్ద మనుషులు రంగప్రవేశం చేసి, ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చినట్లు సమాచారం.

దాడి చేసి.. డబ్బులు, ఫోన్ లాక్కెళ్లి

- పోలీసులకు చిక్కిన ముగ్గురు నిందితులు
- 200 గ్రాముల గంజాయి, బైక్, 4 ఫోన్లు, రూ.5 వేలు స్వాధీనం

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఓ వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన ముగ్గురు వ్యక్తులు పోలీసులకు చిక్కారు. వారిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఉప్లూర్‌కు చెందిన సుదగోని గంగాధర్‌గౌడ్ అనే డ్రైవర్ ఈ నెల 21న రాత్రి మక్కల లోడును ఆర్మూర్ వైపు నుంచి మెట్‌పల్లి వైపు తీసుకెళ్తున్నాడు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండలింగాపూర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి మూత్ర విసర్జన చేస్తున్నాడు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై అక్కడికి వచ్చారు. అతన్ని అగ్గిపెట్టె ఉందా అని అడిగి, దాడి చేశారు. రూ.5 వేలు, సెల్‌ఫోన్ లాక్కొని, ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించి, పరారయ్యారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి, నిందితుల కోసం గాలించగా సోమవారం మేడిపల్లి క్రాసింగ్ వద్ద బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించారు. సీఐ నిరంజన్‌రెడ్డి వారిని పట్టుకున్నారు. విచారణలో మెట్‌పల్లి మండలంలోని మేడిపల్లికి చెందిన ఏనుగు వంశీ, మెట్‌పల్లి మఠంవాడకు చెందని బైండ్ల వేణు, బండలింగాపూర్‌కు చెందిన కైర వెంకటేశ్ అలియాస్ రవిగౌడ్‌లని తేలిందన్నారు. వ్యాన్ డ్రైవర్‌పై దాడి చేసి, ఫోన్‌తోపాటు రూ.5 వేలు ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి బైక్‌లో 200 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయితోపాటు 4 ఫోన్లు, రూ.5 వేలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 48 గంటల్లోనే నిందితులను పట్టుకున్న సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై అనిల్‌కుమార్, కానిస్టేబుళ్లు గంగారాం, చైతన్యలను డీఎస్పీ అభినందించారు.


అరెస్టు చూపుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

తల్లిదండ్రులతో గొడవపడి.. పెట్రోల్ తాగి

- తండ్రికి ఫోన్ చేసిన కుమారుడు
- తర్వాత అపస్మారక స్థితిలోకి..
- సెల్‌ఫోన్ లొకేషన్ ద్వారా గుర్తించి, ఆస్పత్రికి తరలింపు

ముస్తాబాద్(సిరిసిల్ల): తల్లిదండ్రులతో గొడవపడ్డాడు.. క్షణికావేశంలో పెట్రోల్ తాగాడు ఓ యువకుడు.. కడుపులో మంట భరించలేక తండ్రికి ఫోన్ చేయడంతో కానిస్టేబుల్ సహాయంతో ఆస్పత్రికి తరలించాడు. వివరాల్లోకి వెళ్తే.. ముస్తాబాద్ మండలంలోని మద్దికుంటకు చెందిన పల్లపు నరేశ్ సోమవారం ఇంట్లో అమ్మానాన్నతో గొడవ పడ్డాడు. అలిగి, బయటకు వెళ్లిపోయాడు. ముస్తాబాద్, నామాపూర్ గ్రామాల మధ్య చెట్ల పొదల్లో పెట్రోల్ తాగాడు. కడుపులో మంట భరించలేక తండ్రి నర్సింలుకు ఫోన్ చేశాడు. తనను కాపాడాలంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. నర్సింలు చుట్టుపక్కల గాలించినా నరేశ్ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, విషయం చెప్పాడు. ఎస్సై గణేశ్ ఆదేశాలతో ఐటీ కానిస్టేబుల్ రాజశేఖర్ వెంటనే నరేశ్ సెల్‌ఫోన్ లొకేషన్ తెలుసుకున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో చెట్ల మధ్య ఉన్న నరేశ్‌ను గుర్తించి, హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నట్లు తెలిపారు. యువత తల్లిదండ్రులతో గొడవ పడి, క్షణికావేశంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఎస్సై సూచించారు.


చికిత్స పొందుతున్న నరేశ్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


మక్కయ్య మృతదేహం

కోరుట్ల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని ఏస్కొనిగుట్టకు చెందిన పెంట మక్కయ్య (47) సోమవారం ఉదయం బైక్‌పై కోరుట్ల వైపు వస్తున్నాడు. పట్టణ శివారులోని గార్డెన్స్ వద్ద ఆగివున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు ఢీకొని ఒకరు..

కరీంనగర్‌రూరల్: కారు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ వివరాల ప్రకారం.. కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామ పంచాయతీ పరిధి ప్రియదర్శిని కాలనీకి చెందిన జేరిపోతుల ఆంజనేయులు(45) సెంట్రింగ్ మేస్త్రీగా పని చేస్తున్నాడు. అతనికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆంజనేయులు ఆదివారం రాత్రి 7 గంటలకు పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. దుర్శేడ్ శివారులో అతివేగంగా వస్తున్న కారు వెనక నుంచి అతన్ని బలంగా ఢీ కొట్టింది. అదే సమయంలో కరీంనగర్ నుంచి నల్ల గుంటపల్లెకు బైక్‌పై వెళ్తున్న దుబ్బాసి వినోద్, వడ్లూరి కిరణ్ ఈ ప్రమాదాన్ని గుర్తించి, ఆంజనేయులు భార్యకు ఫోన్ చేసి, చెప్పారు. అనంతరం బైక్‌పై కారును వెంబడించినా ఫలితం లేకపోయింది. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతివేగంగా కారు నడిపి, తన భర్త మృతికి కారణమైన కారు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య సరిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.


ఆంజనేయులు (ఫైల్)

మృతుడి నేత్రాల సేకరణ..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆంజనేయులు కోరిక మేరకు అతడి నేత్రాలను సోమవారం కుటుంబసభ్యుల సమక్షంలో ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాల సిబ్బంది సేకరించారు. కుటుంబసభ్యులు జేరిపోతుల యశ్వంత్, సాయిచరణ్, సుమన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు కోల అన్నారెడ్డి, చింతల కిషన్, గాజుల సతీశ్‌కుమార్ తదితరులున్నారు.

రైతు మృతికి కారణమైన వ్యక్తి అరెస్టు

- పంటల రక్షణకు విద్యుత్ సరఫరా చేయొద్దు
- మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

మల్లాపూర్(కోరుట్ల): పంట రక్షణకు ఏర్పాటు చేసిన కంచెకు విద్యుత్ సరఫరా చేసి, ఓ రైతు మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సోమవారం మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌కు చెందిన గొండ సాయన్న తన వ్యవసాయ భూమిలో మొక్కజొన్న సాగు చేశాడు. ఆ పంటను అటవీ జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు చుట్టూ ఇనుప కంచె అమర్చి, అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నాడు. ఈ మొక్కజొన్న పంట పక్కనే జెల్ల పెద్ద ముత్తన్న(60) వరి సాగు చేస్తున్నాడు. ఈ నెల 18న పంటకు ఎరువు చల్లుతూ ప్రమాదవశాత్తు ఇనుప కంచెకు తగిలాడు. దీంతో విద్యుదాఘాతం సంభవించి, అక్కడికక్కడే మృతి చెందాడు. ఇనుప కంచెకు కరెంట్ వస్తుందన్న సమాచారం ఇవ్వకుండా సాయన్న తన భర్త మృతికి కారణమయ్యాడని మృతుడి భార్య పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై కిరణ్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ వినీత్‌రెడ్డిలతో కలిసి సీఐ నిరంజన్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టారు. అప్పటికే నిందితుడు సాయన్న పరారయ్యాడు. సోమవారం కుస్తాపూర్‌కు వచ్చాడన్న సమాచారంతో పోలీసులు వెళ్లి, అతన్ని అరెస్టు చేశారు. రైతులు పంటల రక్షణ కోసమని అనుమతి లేకుండా విద్యుత్ సరఫరా చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ కలీం, కానిస్టేబుళ్లు భూమయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి


పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రామగుండం వాసులు

పెద్దపల్లిరూరల్: రామగుండంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను తమకు కేటాయించాలని ఎంపికైన లబ్ధిదారులు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి, నిరసన తెలిపారు. మొత్తం 660 ఇళ్ల కోసం ఇప్పటికే ఎంపిక చేసినవారికి వీలైనంత త్వరగా ఇళ్లను కేటాయించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేసేలా చొరవ చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్షకు విన్నవించారు. గతంలోనూ పలుమార్లు మొరపెట్టుకున్నామని, ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆయన ఎంపికైనవారికి నెల రోజుల్లోగా ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు ఐదారు మాసాల సమయం పట్టే అవకాశముందని పేర్కొన్నారు.